సాక్షి
చిత్తూరు
సోమవారం । 16 । జూన్ । 2025



మంత్రివర్యా.. మద్దతు ధరేది?
పరిశ్రమ నిర్వాహకులు కచ్చితంగా తోతాపురి కిలో రూ.8కి కొనుగోలు చేయాలని మంత్రి ఆదేశించినా అమలు కాలేదు. - 8లో



'వేరుశనగ'పై వెనుకడుగు
ఏటా ఖరీఫ్‌లో సాగు చేస్తున్న వేరుశనగకు గిట్టుబాటు కావడం లేదని సాగుపై రైతులు ఆసక్తి చూపడం లేదు. - 8లో



కాణిపాకంలో కమిషనర్
కాణిపాకంలోని వరసిద్ధి వినాయకస్వామిని దేవదాయశాఖ కమిషనర్ ఆదివారం స్వామిని దర్శించుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఇంచార్జి కలెక్టర్ విద్యాధరి వెల్లడించారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

నేడు పోలీస్ గ్రీవెన్స్

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలోని వన్‌టౌన్ పక్కనున్న ఉన్న ఆర్ముడు రిజర్వు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రజలు వారి సమస్యలు ఏవైనా ఉంటే తనను నేరుగా కలిసి మాట్లాడొచ్చన్నారు. ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడతామని ఎస్పీ తెలిపారు.

పేద విద్యార్థినికి మాజీ మంత్రి చేయూత

– మెడిసిన్ చదివిస్తానంటూ హామీ



విద్యార్థిని జయశ్రీకి స్వీట్ తినిపిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి : నీట్ ప్రవేశ పరీక్షలో 95.86 శాతంతో 471 మార్కులు సాధించి సత్తా చాటిన విద్యార్థిని జయశ్రీని మాజీ మంత్రి ఆర్కే రోజా ప్రశంసించడంతో పాటు తన ఖర్చులతో మెడిసిన్ చదివిస్తానని హామీ ఇచ్చారు. విజయపురం మండలం ఆలపాకం గ్రామానికి చెందిన రంగనాథరెడ్డి కుమార్తె జయశ్రీ తన తల్లిదండ్రులతో కలిసి ఆదివారం నగరిలో రోజాను కలిశారు. ఈ సందర్భంగా రోజా జయశ్రీకి స్వీట్ తినిపించి అభినందించారు. మెడిసిన్ చదువుకు అయ్యే పూర్తి ఖర్చును తానే భరిస్తానని భరోసా ఇచ్చారు. కాగా జయశ్రీ రెండేళ్లుగా తిరుపతిలోని చైతన్య జూనియర్ కళాశాలలో చదివినా ఇంటర్ చదువుకు సైతం మాజీ మంత్రి రోజానే ఖర్చులు భరించడం విశేషం. పేద విద్యార్థులను అక్కున చేర్చుకొని వారి ఉన్నత విద్యకు చేయూతనిస్తున్న మాజీ మంత్రి ఉదారతను పలువురు ప్రశంసిస్తున్నారు.

బదిలీ అయిన టీచర్లు కొత్త పాఠశాలల్లో చేరాలి

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు పరిధిలో బదిలీ అయిన ఎస్జీటీ, లాంగ్వేజ్ పండిట్, పీటీలు, ఉద్యోగోన్నతులు పొందిన టీచర్లు కొత్త పాఠశాలల్లో చేరాలని డీఈఓ వరలక్ష్మి అన్నారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న ఉమ్మడి చిత్తూరు జిల్లా బదిలీ, ఉద్యోగోన్నతుల ప్రక్రియ ఆదివారంతో ముగిసిందన్నారు. బదిలీలు పొందిన టీచర్లు వెంటనే పాత స్థానాల్లో రిలీవ్ అయ్యి కొత్త స్థానాల్లో చేరాలని డీఈఓ ఆదేశించారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నెల రోజులుగా సాగిన టీచర్ల బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. కౌన్సెలింగ్ మొదలైన నాటి నుంచి ముగిసే వరకు ఏదో ఒక సమస్య వెంటాడుతూ వచ్చింది. ఎస్‌ఏలు, హెచ్‌ఎంలు, పండిట్‌లకు ఆన్‌లైన్ విధానం, ఎస్జీటీలకు మాన్యువల్‌లో బదిలీలు చేపట్టారు. రెండు విధానాల్లోనూ బదిలీలను పకడ్బందీగా నిర్వహించడంలో కూటమి సర్కారు విఫలమైంది. బదిలీల్లో ఉపాధ్యాయులకు ఆనందం కంటే ఆందోళనే ఎక్కువ కనిపించింది. గతంలో ఎప్పుడూ ఇలాంటి అడ్డదిడ్డ బదిలీలు చూడలేదని గురువులు గుర్రు మంటున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన బదిలీల ప్రక్రియ పై సాక్షి గ్రౌండ్ రిపోర్ట్ కథనం.

ఆన్‌లైన్ బదిలీల్లో జరిగిన తప్పిదాలను పరిష్కరించాలని డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న డీఈవో పూల్ భాషా పండితులు



ముగిసిన బాధల బదిలీలు

- వారం రోజులుగా సాగిన టీచర్ల కౌన్సెలింగ్
- ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఉపాధ్యాయుల బదిలీలు
- వింత నిబంధనలతో నష్టపోయిన ఎస్జీటీ, భాషా పండితులు
- గత వైఎస్సార్‌సీపీ పాలనలో సాఫీగా సాగిన బదిలీల కౌన్సెలింగ్
- కోర్టు తలుపు తట్టేందుకు సిద్ధమవుతున్న బాధిత ఉపాధ్యాయులు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొత్తం పాఠశాలలు 4,737

ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యాయుల వివరాలు

ప్రాథమిక పాఠశాలలో టీచర్లు :	3,236
ప్రాథమికోన్నతలో :	656
ఉన్నత పాఠశాలలో :	1,766
హైస్కూల్ ప్లస్ :	485
జూనియర్ కళాశాలలో :	466



కౌన్సెలింగ్ కేంద్రంలో రాత్రి సమయంలో నిరీక్షిస్తున్న ఎస్జీటీలు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో పారదర్శకంగా, పకడ్బందీగా సాగాల్సిన బదిలీల ప్రక్రియపై టీచర్లు సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కి ఆందోళనలు చేపట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ ప్రారంభమైన మొదటి రోజు నుంచి ప్రక్రియ ముగిసే వరకు గందరగోళం నెలకొంది. కేడర్ల వారీగా పారదర్శకమైన సీనియారిటీ జాబితా రూపొందించడంలో జిల్లా విద్యాశాఖ విఫలమైంది. మెరిట్ రోస్టర్ ప్రకారం కాకుండా రోస్టర్ మెరిట్ ప్రకారం జాబితా సిద్ధం చేశారు. ఈ విషయంపై రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్‌కు ఫిర్యాదులు వెళ్లడంతో ఆ తర్వాత సరిదిద్దారు. ఆ జాబితాల్లో తప్పులుండటంతో విద్యాశాఖ అధికారులను ఏమి అడిగినా తమకు సంబంధం లేదని నిర్లక్ష్య సమాధానం చెప్పడంతో చాలా మంది టీచర్లు నష్టపోయారు.

జీఓ 22కు తిలోదకాలు

కౌన్సెలింగ్ ప్రక్రియలో జీఓ 22కు వ్యతిరేకంగా ఇష్టానుసారంగా వ్యవహరించారు. మొదట్లో 2008 హామీ పత్రాలకు సంబంధించి నోషనల్ సీనియారిటీని..సీనియారిటీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు. ఈ విషయంపై నోషనల్ సీనియారిటీ కేవలం ఆర్థిక, ఉద్యోగోన్నతులకు మాత్రమే వర్తిస్తుందని పలువురు టీచర్లు అప్పీల్ చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ తర్వాత లీప్ యాప్‌లో డేటా సరిదిద్దారు. ఈ నిర్ణయం వల్ల 133 మంది టీచర్లు నోషనల్ సీనియారిటీని సరిదిద్దుకోకుండా అదే స్థానాల్లో బదిలీలు పొందారు. ఈ విషయంలో జిల్లా విద్యాశాఖ అధికారుల మాట విన్నందుకు చాలా మంది టీచర్లు బదిలీల్లో నష్టపోయారు. నోషనల్ సీనియారిటీ సరిదిద్దుకోని టీచర్లు లాభం పొందారు.

వైఎస్సార్‌సీపీ సర్కారులో పారదర్శకంగా బదిలీలు


గత వైఎస్సార్‌సీపీ సర్కారు పాలనలో టీచర్ల బదిలీలు సాఫీగా సాగాయి. టీచర్లకు అప్పట్లో నిర్వహించిన ఆన్‌లైన్ బదిలీల్లో ఎలాంటి సమస్యలు తలెత్తని పరిస్థితి. నిబంధనల ప్రకారం బదిలీలు నిర్వహించడంతో గతంలో అన్ని కేడర్ల టీచర్లకు న్యాయం జరిగింది. అయితే ప్రస్తుత కూటమి సర్కారు టీచర్ల బదిలీల బాధలను మిగిల్చారు. బదిలీల ప్రక్రియలో సాఫ్ట్‌వేర్ తప్పిదం, విద్యాశాఖ అధికారుల నియతృత్వ పోకడలతో చాలా మంది టీచర్లు నష్టపోయారు. ఈ బదిలీల ప్రక్రియలో నష్టపోయిన పలు కేడర్ల టీచర్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు సిద్ధమయ్యారు. కూటమి పాలనలో నిర్వహించిన బదిలీల్లో తీవ్రంగా నష్టపోయామని కొంత మంది టీచర్లు మదనపడుతున్నారు.



సమస్యలు పరిష్కరించాలని డీఆర్‌వో మోహన్ కుమార్‌ను చుట్టుముట్టిన టీచర్లు (ఫైల్)



- ఈ చిత్రంలో కనిపిస్తున్న ఉపాధ్యాయురాలు పేరు సుధారాణి. ఆమె 9 నెలల్లో ఉద్యోగ విరమణ పొందనున్నారు. అయితే డీఈవో పూల్ లో ఉండే భాషా పండితుల బదిలీల్లో ఆమెకు అన్యాయం జరిగింది. కూటమి పాలనలో వెబ్ విచిత్ర బదిలీలతో ఉద్యోగ విరమణ పొందే సమయంలో ఆమె సీనియర్ అయినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా 120 కి.మీ దూరంలో బదిలీ చేశారు. తిరుపతి సమీపంలో ఆప్షన్ నమోదు చేసినప్పటికీ దూరప్రాంతంలో బదిలీ చేయడంతో ఆమె నష్టపోయింది.



- ఈ టీచర్ పేరు కస్తూరీ. ఈమెకు స్పౌజ్ నిబంధనను నమోదు చేసుకున్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా 90 కి.మీ దూరంలో బదిలీ చేశారు. దీంతో ఈమె ప్రస్తుత బదిలీల్లో నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.



- ఈ టీచర్ పేరు కనకదుర్గ. ఈమె న్యాయపరంగా భర్తతో విడాకులు తీసుకున్నారు. దీంతో ప్రిఫరెన్షియల్ కేటగిరీలో పాయింట్స్ పొంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే అన్ని అర్హతలున్నా నిబంధనలకు వ్యతిరేకంగా అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలానికి బదిలీ చేశారు.

టీచర్లకు బదిలీల్లో అన్యాయం ఇలా..

- గతంలో టీటీడీ పరిధిలో పనిచేసే ఉద్యోగులకు స్పౌజ్ పాయింట్లు ఇచ్చేవారు. ప్రస్తుతం వారికి పాయింట్లు ఇవ్వడం కుదరదని మొండికేశారు. కమిషనర్ కార్యాలయం నుంచి వివరణ వచ్చినప్పటికీ పరిగణలోకి తీసుకోని పరిస్థితి. దీంతో చాలా మంది పీఎస్ హెచ్‌ఎంలు దూర ప్రాంతాలకు బదిలీ అయ్యారు.
- 2021లో బదిలీలు పొంది 2025లో రేషనలైజేషన్‌కు గురైన వారికి పాత స్టేషన్ పాయింట్లు ఇవ్వకుండా ఇబ్బందులు సృష్టించారు.
- ప్రిఫరెన్షియల్ కేటగిరీకి సంబంధించి తిరుపతి రుయాలో ప్రత్యేకంగా చికిత్సలు చేయించి మైల్డ్, మోడరేట్, సివియర్ అని ఫలితాలు ఇచ్చారు. సంబంధిత టీచర్లకు పర్సంటేజీలు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టారు. అయితే చివరి వరకు ఆ సమస్య పరిష్కరించకపోవడంతో ఫిపరెన్షియల్ పాయింట్లు పొందలేక నష్టపోయారు.
- అలవెన్స్‌లు పొందుతున్న టీచర్లకు బదిలీల్లో మినహాయింపులు ఇచ్చారు. అయితే సంబంధిత టీచర్లకు బదిలీల్లో ప్రాధాన్యం కల్పించలేదు.
- సీనియారిటీ జాబితాల్లో తప్పుల సవరణకు సంబంధించి అభ్యంతరాలు ఇచ్చిన టీచర్ల పై దురుసుగా ప్రవర్తించి మొండిగా వ్యవహరించారు. సంఘాల నాయకులను కౌన్సెలింగ్ కేంద్రంలోకి రానివ్వకుండా బెదిరింపులకు గురిచేశారు.
- జిల్లాలోని ప్రతి పాఠశాలలో ఎటువంటి పోస్టును బ్లాక్ చేయకుండా బదిలీలు నిర్వహిస్తామని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు గొప్పలు చెప్పారు. అయితే ఈ బదిలీల్లో పలు పోస్టులు బ్లాక్ చేసి టీచర్లు నష్టపోయేలా వ్యవహరించారు. దీంతో సీఎం సొంత నియోజకవర్గం కుప్పంలో చాలా మంది టీచర్లు బదిలీ అయినా రిలీవర్ లేక అలాగే కొనసాగాల్సిన దుస్థితి. బదిలీ అయినా కుప్పం నుంచి విముక్తి కలగలేదని చాలా మంది టీచర్లు ఆవేదన చెందుతున్నారు.
- స్పౌజ్ విషయంలో స్పౌజ్ ఎక్కడ ఉంటే చుట్టు పక్కల ఉండే మండలాలకు వెళ్లాలి. అయితే ఈ నిబంధన ఎస్జీటీ బదిలీల్లో సీరియల్ నంబర్ 204 వరకు అమలు చేయకపోవడంతో నష్టపోయారు. ఇద్దరు టీచర్లు కంపల్‌సరీ బదిలీ అయితే వారు ఎక్కడైనా కోరుకునే అవకాశం ఉంటుంది. అయితే జిల్లా విద్యాశాఖ అధికారులు ఆ నిబంధనను అమలు చేయకుండా నిర్బంధం పెట్టి సర్టిఫికెట్ ఎక్కడ పెట్టి ఉంటే అక్కడే కోరుకోవాలనే వింత పోకడ అమలు చేశారు. దీంతో వందల సంఖ్యలో టీచర్లు బదిలీల్లో నష్టపోయారు. ఆ తర్వాత ఆందోళనలు చేశాక అమలు చేశారు.
- స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లకు ఉద్యోగోన్నతి ఇస్తున్నామని చెప్పి చివరికి వారికి ఉద్యోగోన్నతులు ఇవ్వకుండా తిరిగి పంపేశారు.
- డీఈవో పూల్ లో ఉన్న వందల మంది భాషా పండితులకు నిబంధనలకు వ్యతిరేకంగా బదిలీలు చేశారు. సీనియారిటీ ఉన్న వారికి దూరంగా, జూనియర్‌లకు దగ్గరగా పోస్టింగ్‌లు ఇచ్చారు. దీంతో ఆ టీచర్లు బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ చివరి రోజు డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది.



ఎస్జీటీలకు నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ ప్రక్రియ (ఫైల్)

అబద్ధాలతో అరాచక పాలన

- ఏడాదిగా ప్రజలను వంచిస్తున్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్
- తల్లికి వందనం అంటూ 30లక్షల మందికి మోసం
- ఆలయాలు కూల్చేసి మనోభావాలను దెబ్బతీస్తున్న కూటమి నేతలు
- భూమన కరుణాకరరెడ్డి, ఆర్‌కే రోజా



కూటమి మోసాలపై పుస్తకం ఆవిష్కరిస్తున్న భూమన, రోజా, సిపాయి సుబ్రమణ్యం, భరత్, శిరీష, విజయానందరెడ్డి, నూకతోటి రాజేష్, వెంకటేగౌడ్, సునీల్‌కుమార్

తిరుపతి మంగళం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఏడాదిగా రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి మండిపడ్డారు. ఆదివారం తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో కూటమి ఏడాది పాలనలో మోసాలపై ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. మాజీ మంత్రి ఆర్‌కే రోజా, చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు చావా రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, భరత్, తిరుపతి కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, చిత్తూరు, సత్యవేడు, పలమనేరు, పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్తలు విజయానందరెడ్డి, నూకతోటి రాజేష్, వెంకటేగౌడ్, సునీల్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భూమన కరుణాకరరెడ్డి మాట్లాడారు. ఎలాగైనా అధికారంలోకి రావాలని నోటికొచ్చిన అబద్ధపు హామీల చంద్రబాబు, పవన్‌కల్యాణ్ గుప్పించారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ఒక్క హామీని కూడా అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. ఎన్నికల సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పథకాల కంటే రెండింతలు ఇస్తానని చెప్పి, అందరినీ వంచించిన ప్రజాద్రోహి చంద్రబాబు అని స్పష్టం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.2.80లక్షల కోట్లను సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. అమ్మ ఒడి పథకం కింద రాష్ట్రంలో ఎంతమంది లబ్ధిదారులు ఉంటే అంతమంది తల్లుల ఖాతాల్లోకి రూ. 15వేలు చొప్పున జమచేసిన మొనగాడు జగనన్న అని కొనియాడారు. అయితే తల్లికి వందనం అంటూ చంద్రబాబు 30లక్షల మంది తల్లుల ఖాతాల్లో డబ్బులు వేయకుండా ఎగనామం పెట్టారన్నారు. అలాగే ఆడబిడ్డ నిధి కింద ప్రతి నెలా మహిళలకు రూ. 1,500 చొప్పున అందిస్తామని మోసం చేశారని చెప్పారు. యాభై ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు రూ. 4వేలు, నిరుద్యోగులకు రూ. 3వేలు భృతి, అన్నదాతా సుఖీభవ కింద రైతులకు రూ. 20వేల చొప్పు ఇస్తానంటూ చెప్పిన హామీలన్నీ ఏమైయ్యాయి చంద్రబాబు అని ప్రశ్నించారు. ఏడాది కాలంలో మోసాలు, అభూతకల్పనలతోనే పాలన సాగించారే కానీ, రాష్ట్ర ప్రజలకు చేసిందేమీ లేదని మండిపడ్డారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నోరు పారేసుకోవడం, వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు నమోదు చేయడం, ఎల్లో మీడియా ద్వారా విషం చిమ్మడమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తిరగబడే రోజులు వచ్చాయి

మాజీ మంత్రి ఆర్‌కే రోజా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాసంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిని పక్కన పెట్టి అరాచకాలు, అక్రమాలతో లోకేష్ రెడ్‌బుక్ పాలన సాగుతోందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం సంక్షేమ పథకాలను అందించకుండా వైఎస్సార్‌సీపీ నేతలు, జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. సుప్రీంకోర్టు చెంపదెబ్బ కొడుతున్నా చంద్రబాబు బుద్ధి తెచ్చుకోవడం లేదన్నారు. అలాగే గిట్టుబాటు ధర కల్పించని చంద్రబాబుపై మామిడి రైతులు భగ్గుమంటున్నారని తెలిపారు. రైతు బాంధవుడు వైఎస్ రాజశేఖరరెడ్డి అడుగుజాడల్లోనే ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారని, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మామిడి రైతులకు రూ. 40 గిట్టుబాటు ధరను కల్పించారని గుర్తుచేశారు.అదే కూటమి ప్రభుత్వంలో రూ.4లు కూడా గిట్టుబాటు ధర పలకకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజాసమస్యలు, సంక్షేమాన్ని పవన్‌కల్యాణ్ గాలికి వదిలేశారన్నారు. సనాతనధర్మాన్ని పరిరక్షిస్తానంటూ ఊదరగొట్టి, రాష్ట్రంలోని పలు ఆలయాలను కూటమి నేతలు కూల్చివేస్తుంటే ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అండతో కూటమి నేతలు ఇష్టారాజ్యంగా ఆలయాలను కూలుస్తూ హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. అరాచక పాలనపై ప్రజలు తిరగబడే రోజులు వచ్చాయని హెచ్చరించారు. ప్రభుత్వ అకృత్యాలను ఎండగట్టేలా వైఎస్సార్‌సీపీ పోరాటం ఉంటాయని స్పష్టం చేశారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు



మాట్లాడుతున్న ట్రాన్స్‌కో డైరెక్టర్ గురవయ్య

చిత్తూరు కార్పొరేషన్: వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే ధ్యేయంగా సిబ్బంది, అధికారులు పనిచేయాలని ట్రాన్స్‌కో టెక్నికల్ డైరెక్టర్ గురవయ్య తెలిపారు. ఆయన ఆదివారం ఎస్‌ఈ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 60 శాతం మంది వినియోగదారులు సంతృప్తి స్థాయిలో ఉన్నట్టు తెలిపారు. సిబ్బంది, అధికారులు సకాలంలో వినియోగదారులకు ఫోన్లలో సమాధానం ఇవ్వడంతోపాటు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అప్పుడే 90 శాతానికి పైగా సంతృప్తి చెందుతారని వెల్లడించారు. అధికారులు తప్పనిసరిగా మండల, జిల్లా కేంద్రాల్లో అందుబాటులో ఉండాలన్నారు. కొంతమంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలతో అల్లాడుతున్నట్టు తెలిపారు. స్టోర్స్‌లో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు, అనుబంధ సామగ్రి ఉన్నా రైతులకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. అందటం లేదన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులకు రైతులు ట్రాక్టర్లు పెట్టుకొని ఎస్‌పీఎంకు రావడం ఆగలేదన్నారు. ఎన్ని రోజులు వర్క్ ఆర్డర్లు పెండింగ్‌లో ఉన్నట్లు నోటీసులు అందుకుంటారని, వాటిని క్లోజ్ చేయడానికి ఇంకా ఎంత సమయం కావాలని మండిపడ్డారు. ఎంతో ఉపయోగమైన ఆర్‌డీఎస్‌ఎస్ పనుల ఆలస్యంపై అసహనం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని ఎస్‌పీఎంలో నూతన ఓఆర్‌ఎం మెషిన్ ఇన్‌స్టలేషన్ కోసం చర్చలు జరుపుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఈ ఇస్మాయిల్‌అహ్మద్, ఈఈ సురేష్, జగదీష్, అమర్‌బాబు, పీవో రెడ్డెప్ప, ఏవో ప్రసన్న, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక



జూనియర్ ఫుట్‌బాల్ జట్టుతో నిర్వాహకులు

పలమనేరు : చిత్తూరు జిల్లా జూనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక ఆదివారం పలమనేరులో జరిగిందని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హేమంత్ రెడ్డి, కిశోర్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం జిల్లా నుంచి వచ్చిన క్రీడా కారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ ఆధారంగా సెలక్షన్స్ జరిగాయని పేర్కొన్నారు. ఈ ఎంపికలో సీఎస్ నవీన్, అంజాద్, జలాల్, కోచ్ విక్కీ, జాకీర్, కిరణ్, సాగర్, హరీష్ పాల్గొన్నారు.

తహసీల్దార్ బదిలీల్లో అన్యాయం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఇటీవల నిర్వహించిన తహసీల్దార్ బదిలీల్లో వివక్ష జరిగిందని పలువురు బాధిత తహసీల్దార్లు వాపోతున్నారు. బదిలీల్లో ఎస్సీ, ఎస్టీలకు చెందిన రెగ్యులర్ తహసీల్దార్లకు పోస్టింగ్స్ ఇవ్వకుండా అన్యాయం చేశారని చెబుతున్నారు. రెగ్యులర్ తహసీల్దార్లు జిల్లాలో ఉన్నప్పటికీ పోస్టింగ్‌లు ఇవ్వకుండా వివక్ష చూపడం బాధాకరమని చెబుతున్నారు. రెగ్యులర్ తహసీల్దార్లకు పోస్టింగ్‌లు ఇవ్వకుండా లూప్ లైన్‌లో పెట్టి అర్హత లేని డిప్యూటీ తహసీల్దార్లకు పోస్టింగ్‌లు ఇచ్చారని చెబుతున్నారు. క్రమశిక్షణ కేసులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ డిప్యూటీ తహసీల్దార్‌లకు తహసీల్దార్లుగా పోస్టింగ్ ఇవ్వడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిప్యూటీ తహసీల్దార్‌లకు కూటమి నాయకుల అండ ఉండటంతో అడ్డదారుల్లో పోస్టింగ్‌లు ఇచ్చారని చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో 7 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ రెగ్యులర్ తహసీల్దార్లు ఎలాంటి అండదండలు లేక సీనియర్‌లు అయినప్పటికీ పోస్టింగ్‌లు లేక కలెక్టరేట్‌లో ఖాళీ కుర్చీలకు పరిమితం అయినట్లు వెల్లడిస్తున్నారు. ఈ సమస్యను కలెక్టర్ పరిశీలించి న్యాయం చేయాలని బాధిత సీనియర్ తహసీల్దార్లు కోరుతున్నారు.

కాణిపాకంలో కమిషనర్



స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఈవో

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామిని ఆదివారం రాష్ట్ర దేవదాయ ధర్మాదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. పండితులు ఆశీర్వచనాలు చేశారు. అనంతరం ఈవో పెంచలకిషోర్ స్వామివారికి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు. తొలుత కమిషనర్ పలు అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో, ఈఈతో చర్చించారు. తర్వాత నూతనంగా నిర్మిస్తున్న అన్నదాన భవనం, వినాయక సదన్, గణేష్ సదన్, నిత్యాన్నదాన భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఈఈ వెంకటనారాయణ, తిరుపతి దేవదాయశాఖ సహాయ కమిషనర్ రామకృష్ణారెడ్డి, ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, హరి మాధవరెడ్డి, ప్రసాద్, ధనంజయ పాల్గొన్నారు.

"జిల్లాలోని కొన్ని మ్యాంగో ఫ్యాక్టరీలను తిరిగాను. ఫ్యాక్టరీ నిర్వాహకులతో మాట్లాడాను. ఈ రోజు తోతాపురి ధర కిలో రూ.7 అన్నారు. దానికి నేను ఒప్పుకోలేదు. ఇప్పటి నుంచే రూ.8కి కొనుగోలు చేయాలని చెప్పాను. ఆ ఒక్క ఫ్యాక్టరీయే కాదు.... జిల్లాలోని అన్ని ఫ్యాక్టరీలు ప్రభుత్వం ప్రకటించిన రూ. 8కే కొంటారు. చివరి వరకూ ఇదే రేటు ఉంటుంది. ఎక్కడ కానీ రూ.5,రూ.6 రూ.7 అనే మాటే ఉండదు. దీనికి ప్రభుత్వం ప్రోత్సాహ నిధిగా కిలో రూ.4 ఇస్తుంది. రైతులు తొందర పడొద్దు. స్వేచ్ఛగా కాయలు అమ్మండి. సరిహద్దులో చెక్‌పోస్టులు పెట్టి..జిల్లా రైతులకు న్యాయం చేస్తాం. మామిడికి మద్దతు ధర ఇప్పించే బాధ్యత మాది." ఇలా చిత్తూరు పర్యటనకు వచ్చిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు ఇవీ.



ఫ్యాక్టరీ వద్ద క్యూకట్టిన ట్రాక్టర్లు, లారీలు

మంత్రివర్యా.. మద్దతు ధరేది?

- తోతాపురి రూ.8కి కొనాలని మంత్రి ఆదేశం
- క్షేత్రస్థాయిలో అమలు కాని ఆదేశాలు
- ర్యాంపుల్లో కిలో రూ. 4... ఫ్యాక్టరీలో రూ.5, రూ.6
- రూ.8కి కొనుగోలు చేయలేమంటున్న ఫ్యాక్టరీలు
- ప్రభుత్వ మద్దతు ధరపై రైతుల మండిపాటు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

కాణిపాకం : కూటమి ప్రభుత్వం మామిడి రైతుల కొంప ముంచుతోంది. మద్దతు ధర పేరుతో రైతులను ముప్పుతిప్పలు పెడుతోంది. ర్యాంపుల్లో రూ.4కే పాట పాడుతోంది. ఫ్యాక్టరీలు రూ.5, 6కే ఫిక్స్ అయ్యాయి. మద్దతు ధరను ఫ్యాక్టరీలు మడతబెట్టాయి. రూ.8కే కొనలేమంటున్నాయి. తమిళనాడు కాయలకు గేట్లు తీస్తున్నాయి. తమిళనాడు కాయలు టన్నుల టన్నులుగా తరలి వచ్చేస్తున్నాయి. దీని దెబ్బకు చిత్తూరు కాయలను ఫ్యాక్టరీ నిర్వాహకులు చెత్తలో తీసి పారేస్తున్నారు. ఇది ఇలా ఉంటే... మద్దతు ధరపై మండి పడుతున్నారు. అధికారులు రైతుల కంటికి కనిపించకుండా దాగుడు మూతలాడుతున్నారు.

చెక్‌పోస్టులు ఉత్తిమాటేనా..

తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఉత్పత్తి అయినా మామిడి కాయలు యథేచ్ఛగా జిల్లాకు వచ్చేస్తున్నాయి. జిల్లాలో పండిన కాయలకు మాత్రం ఒక్క టోకెన్‌కు ఒక్క ట్రాక్టర్ మాత్రమే అనుమతిస్తున్నాయి. అయినా ఫ్యాక్టరీల వద్ద పడిగాపులు కాస్తున్నారు. కాయలు ఫ్యాక్టరీలో అన్‌లోడింగ్ కాగా వాహనాలు ఫ్యాక్టరీల ఎదుట క్యూ కడుతున్నాయి. బండి ఫ్యాక్టరీల వద్దకు తీసుకెళితే రెండు రోజుల పాటు అక్కడే కునుకు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ట్రాక్టర్లల్లోనే కాయలు ఆవిరవుతున్నాయి. ఫ్యాక్టరీలు కక్ష పూరితంగా కాయలను అన్‌లోడింగ్ చేయించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. తమిళనాడు నుంచి వచ్చే వాహనాలకు టోకెన్లు లేకపోగా నేరుగా ఫ్యాక్టరీకి తీసుకొచ్చి అన్ లోడింగ్ చేసి వెళ్లిపోతున్నాయి. అది కూడా లారీల్లో తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. దీంతో జిల్లాలోని మామిడి రైతులు మండిపడుతున్నారు. మంత్రి అచ్చెన్నాయుడు సరిహద్దులో చెక్‌పోస్టులు పెట్టి జిల్లా రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇస్తే..పట్టింపు ఏదని మామిడి రైతులు ఆగ్రహానికి గురవుతున్నారు.

జిల్లా మామిడి సాగు వివరాలు

జిల్లాలో మామిడి సాగు విస్తీర్ణం	56 వేల హెక్టార్లు
టేబుల్‌రకం సాగు విస్తీర్ణం	16,105 హెక్టార్లు
తోతాపురి రకం సాగు విస్తీర్ణం	39,895 హెక్టార్లు
పళ్లగుజ్జు పరిశ్రమల సంఖ్య	47
ర్యాంపుల్లో తోతాపురి కేజీ ధర	రూ.4
ఫ్యాక్టరీల్లో కిలో ధర	రూ. 5 నుంచి రూ.6 వరకు

కనిపించని అధికారులు

మామిడి రైతులకు ఇబ్బందులు లేకుండా చూసేందుకు జిల్లా అధికారులు ఫ్యాక్టరీల వద్ద వివిధ శాఖల సిబ్బందికి డ్యూటీలు వేశారు. అయితే వారి ఆ చూకీ అంతు చిక్కడం లేదు. ఫ్యాక్టరీల వద్ద వస్తున్న సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. దరిదాపులో కనిపించకుండా పోతున్నారు. రైతుల దగ్గర నుంచి ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ తీసుకోవడానికి ఫ్యాక్టరీ సెక్యూరిటీలకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. చాలా వరకు ఫ్యాక్టరీల వద్ద శాఖ సిబ్బంది కనిపించడం లేదని, తమ అవస్థలను పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

రెండు రాష్ట్రాల మధ్య వివాదం

మామిడి పంట అమ్మకాలు..కొనుగోలు విషయంలో కూటమి ప్రభుత్వం, కర్ణాటక ప్రభుత్వం మధ్య వివాదం తలెత్తుతోంది. చిత్తూరులో మామిడి కొనుగోలుపై ఆంక్షలు ఏమిటని మండిపడింది. ఏకంగా కర్ణాటక ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు పంపింది. ఇదీ రాజ్యాంగ విరుద్ధమని హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం కర్ణాటక రాష్ట్రం నంగలిలోని మామిడి రైతులు రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేశారు. చిత్తూరులో కాయలు అమ్మడానికి ఆంక్షలు పెట్టారని అక్కడి రైతులు ఆగ్రహానికి లోనయ్యారు. చిత్తూరు జిల్లా నుంచి కర్ణాటక రాష్ట్రానికి వచ్చే ఉత్పత్తులపై ఆంక్షలు విధించాలని డిమాండ్ చేశారు. ఈ వివాదం.. ఇప్పుడు తారస్థాయికి చేరింది.

ఆ రేటుకు కొనలేం

కూటమి ప్రభుత్వం 10 రోజుల కిందట మామిడి పంటకు గిట్టుబాటు ధర కల్పించింది. తోతాపురి కిలో రూ.8కే కొనుగోలు చేయాలని, ప్రభుత్వం రూ.4 ఇస్తుందని ప్రకటించింది. అయితే మద్దతు ధరను ఫ్యాక్టరీలు మడతబెడుతున్నాయి. రూ. 8కి కొనలేమని తేల్చి చెబుతున్నాయి. మంత్రి చెబితే...తమ చేతుల్లో డబ్బులు లేవని చేతులెత్తేస్తున్నాయి. శనివారం చిత్తూరు సభలో తోతాపురిని అన్ని ఫ్యాక్టరీలు రూ. 8కే కొంటాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సభ సాక్షిగా వెల్లడించారు.



విక్రయానికి మామిడి కాయలు

అయితే ఆదివారం చూస్తే మామిడి వ్యాపారం ఇందుకు భిన్నంగా ఉంది. ర్యాంపులో కిలో రూ.4, ఫ్యాక్టరీలు కిలో రూ.5, రూ.6 కొనసాగిస్తున్నాయి. మంత్రి చెప్పినా కిలో రూ.8 రేటు ఎక్కడా అమలు కావడం లేదు.

రెండు రోజులుగా పడిగాపులు



శనివారం మధ్యాహ్నం ఫ్యాక్టరీలకు కాయలు తీసుకొచ్చాం. మేము తీసుకొచ్చింది ట్రాక్టర్లలోనే. ఇక్కడకు లారీల్లో తమిళనాడు కాయలు ఫుల్‌గా వస్తున్నాయి. ఏం చేయాలి. సిఫార్సులుంటే అన్‌లోడింగ్ ఉంటే ముందు పంపిస్తున్నారు. అన్‌లోడింగ్ కాక రెండు రోజులుగా ఇక్కడే ఉన్నాం.

– మదన్ మోహన్‌నాయుడు, చిత్తూరు మండలం

అమ్ముకోవడానికి అవస్థలు పడుతున్నాం



వారం రోజులుగా కాయలు అమ్ముకోవడానికి అవస్థలు పడుతున్నాం. టోకెన్లు అందడం లేదు. క్యూలో నిలబడే లోపే టోకెన్లు అమ్ముడుబోతున్నాయి. తమిళనాడు కాయలన్నీ వచ్చి దూకేస్తున్నాయి. మా కాయలు కొనుగోలు చేసే పరిస్థితి లేదు. అక్కడ రూ. 4, రూ.5కే కొనుగోలు చేసి.. జిల్లా రైతులను చిన్న చూపు చూస్తే ఎలా. కాయలు అమ్ముకోవడానికి మాకు అవకాశం కల్పించండి.

– జయచంద్రారెడ్డి, చిత్తూరు మండలం

వీఆర్వోపై దాడి



గాయపడిన వీఆర్వో రాధయ్య

ఐరాల: భూ తగాదా విషయమై వీఆర్వోపై దాడి చేసిన ఘటన మండలంలోని తెల్లగుండ్లపల్లెలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. మండలంలోని తెల్లగుండ్లపల్లెకు చెందిన వీఆర్వో రాధయ్యకు మల్లారపల్లెలో కొంత భూమి ఉంది. ఆ భూమిలో ఉన్న చింత చెట్లను కోస్తుండగా.. అదే గ్రామానికి చెందిన ఓ మహిళ తమ భూమి అంటూ అడ్డుకుంది. ఆపై ఆమె పోలీసులను ఆశ్రమించడంతో వారు ఇరువురినీ పిలిచి చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో వీఆర్వో ఇంటి దగ్గర ఉండగా మల్లారపల్లెకు చెందిన కొంతమంది ఆయనపై దాడి చేసి గాయపరిచారు. గాయపడిన వీఆర్వోను చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తమ భూమిలో చింత చెట్లు కోసి విక్రయిస్తుండగా అదే గ్రామానికి చెందిన ఇద్దరు, మల్లారపల్లెకు చెందిన ఏడుగురు అకారణంగా దాడి చేసి గాయపరిచినట్లు వీఆర్వో వాపోయారు. ఈ విషయంపై పోలీసులు విచారిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం



గాయపడిన వినోద్

శ్రీరంగరాజపురం : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో పుత్తూరు జాతీయ రహదారి చిన్నతయ్యూరు గ్రామం వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు చిన్నతయ్యూరు గ్రామానికి చెందిన చంద్రమ్మ (60) రోడ్డు పక్కన నడిచి వెళుతుండగా, మండలంలోని శెట్టివనత్తం గ్రామానికి చెందిన బాబు కుమారుడు వినోద్(25) పుల్లూరు క్రాస్ రోడ్డు నుంచి వారి స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా చంద్రమ్మను ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనం ద్వారా చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చంద్రమ్మ మృతి చెందింది. వినోద్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.



సాక్షి క్లాసిఫైడ్స్

Education

■10th / ఇంటర్ ఫెయిల్ అయ్యారా..! (2025-26) సం॥ నష్టపోకుండా AP Govt. ఆమోదం పొందిన మా బోర్డ్ పరీక్షల ద్వారా (ఆల్లైన్/బేసి) పాసై మీకు నచ్చిన Jr. / డిగ్రీ కాలేజీలో చేరే గొప్ప అవకాశం. ఫోన్ : 99851 82105

DIRECT FINAL YEAR

■Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA, Regular/lateral entry.9381287629

Real Estate

PLOT FOR SALE

■తిరుపతిలో కనివిని ఎరుగని రీతిలో అభివృద్ధి చేసిన అగ్రిఫార్మ్ ఫామ్ ల్యాండ్ లో 7 సం.ల ఎర్ర చందనం చెట్లతో సహా రిజిస్ట్రేషన్‌చేయబడును. డైరెక్ట్ ఓనర్. 9502774175, 7996992114.

Wanted

■ Wanted Pre Primay , Primary & High School Teachers for a reputed School in Mangalam, Tirupati, Contact Cell: 81794 67247.

■తిరుపతిలోని సంకల్ప హాస్పిటల్ ప్రక్కన బట్టల షోరూంలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. శా: 15000/- 12h/ 4 w/o ESI+EPF కలదు. ✆ 98852 95999

■ప్రముఖ MNC కంపెని ఆఫీస్‌లో వర్క్ చేయుటకు అనుభవం గల స్త్రీ / పురుషులు కావలెను. అర్హత 10th – డిగ్రీ జీతం 20 వేలు నుంచి. Ph: 99084 29239

■PRO Required-UmaDevi Educational Consultancy. For admissions in Chennai Universities & Colleges. B.Tech, B.Sc & Medical Courses - HIGH EARNING, performance-driven role. 9959954507

■కష్టపెట్టే పని కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా,నర్సులు,వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు- 40 వేలు.ఫ్రీరూం+భోజనం.HYD.Ph:7993583999

■రేణిగుంట / కరకంబాడిలో పనిచేయడానికి సెక్యూరిటీ గార్డులు కావలెను. నెలకు జీతం: 14000/ 8 గం. ఉచిత గది, ESI, PF కలదు. రేణిగుంట బస్టాండ్ దగ్గరకు 17-06-2025న ఉ. 10 గం.లకు ఇంటర్వ్యూకు హాజరు కావలెను. Cell: 83410 38715, 891 960 6707

■త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చంటిపిల్లలను చూసుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ :18K. Ph: 8520980099, 8520874499

గమనిక

నాలుగులైన్ల ప్రకటనకు రూ. :375/- అదనపు లైనుకు రూ.:90/- ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం

CONTACT : 9440166091, 9951602970

కిటకిటలాడిన బోయకొండ

– గంగమ్మ దీవెనల కోసం తరలివచ్చిన జనం





ప్రత్యేక అలంకరణలో బోయకొండ గంగమ్మ, ఆలయంలో భక్తుల రద్దీ

చౌడేపల్లె: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరుగాంచిన బోయకొండ గంగమ్మ దీవెనల కోసం భక్తులు ఆదివారం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు వివిధ వాహనాల్లో రావడంతో బోయకొండ జన సంద్రంగా మారింది. ఒక్క రోజే సుమారు 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు అధికారులు వెల్లడించారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనె దీపాలు, డీవెలతో మేళతాళాల నడుమ జంతు బలులిచ్చి మొక్కులు చెల్లించారు. ఆలయ ఈవో ఏకాంబరం ఆధ్వర్యంలో భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

అప్పుల బాధతో ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్య



రవి (ఫైల్)

బంగారుపాళెం: అప్పుల బాధతో రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చిత్తూరు జిల్లా,పూతలపట్టు నియోజకవర్గం, బంగారుపాళెం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రసాద్ కథనం మేరకు.. మండలంలోని వేపనపల్లెకు చెందిన రవి(52) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గ్రామంలో ఇంటి నిర్మాణం కోసం అప్పులు చేశాడు. చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురై రాగిమానుపెంట గ్రామ సమీపంలోని ఓ మామిడితోటలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గుర్తించి బంగారుపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు కన్నీటి వీడ్కోలు



డ్రైవర్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న డిపో మేనేజర్

గంగాధర నెల్లూరు : ఆర్టీసీ బస్సు డ్రైవర్ లక్ష్మీ కరుణాకుమార్ రెడ్డికి తూగుంద్రంలో కుటుంబ సభ్యులు, బంధువుల అశ్రునయనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. తూగుంద్రం గ్రామానికి చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ లక్ష్మీ కరుణాకుమార్ రెడ్డి శుక్రవారం ఉదయం చిత్తూరు నుంచి బెంగళూరుకు వెళ్లే బస్సును ప్రయాణికులతో తీసుకెళుతుండగా మార్గమధ్యలో హోస్కోట వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన బస్సు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన డ్రైవర్ బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా డ్రైవర్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి పోలీసులు బంధువులకు అప్పగించారు. ఆదివారం ఉదయం స్వగ్రామానికి మృతదేహం చేరింది. ఆర్టీసీ ఉద్యోగులతో పాటు డిపో మేనేజర్ రూపశ్రీ కలిసి డ్రైవర్ మృతదేహానికి నివాళులర్పించారు. డిపో మేనేజర్ మాట్లాడుతూ.. ప్రభుత్వపరంగా కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చి, తక్షణ సాయం కింద 25 వేల రూపాయలు కుటుంబ సభ్యులకు అందించారు. తూగుంద్రం సర్పంచ్ శ్రీ బాబు, ఎంపీటీసీ వాణిశ్రీ, పలు పార్టీ నేతలు నివాళులర్పించారు.

21నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

- తిరుపతి, గూడూరు, సత్యవేడులో హెల్ప్‌లైన్ సెంటర్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : పాలిసెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఈ నెల 21నుంచి జూన్ 28వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన(కౌన్సెలింగ్) నిర్వహించన్నున్నట్లు తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఈ కౌన్సెలింగ్‌ను తిరుపతి, గూడూరు, సత్యవేడులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటర్లలో నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 20నుంచి జూన్ 27వ తేదీలోపు "ఏపీపీఓఎల్‌వైసీఈటీ.ఎన్‌ఐసి.ఇన్" వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఓసీ, బీసీ విద్యార్థులు రూ.700/-, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250/- ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి రసీదును ప్రింట్ అవుట్ తీసుకోవాలన్నారు. ఆయా తేదీల్లో ర్యాంకుల వారీగా ఏర్పాటుచేసిన కౌన్సెలింగ్‌కు హాజరవ్వాలని సూచించారు. ఈ నెల 25 నుంచి జూన్ 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ర్యాంకుల వారీగా ఆప్షన్స్ నమోదు చేసుకోవాలని, జూలై 1న ఆప్షన్స్‌లో మార్పులు చేర్పులు చేసుకోవచ్చని, 3వ తేదీన అలాట్‌మెంట్ ప్రకటిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సీట్లు పొందిన అభ్యర్థులు రూ.4,700/, ప్రైవేటు పాలిటెక్నిక్‌లో చేరే అభ్యర్థులు రూ.25వేలు ట్యూషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు, సందేహాలకు సమీపంలోని హెల్ప్‌లైన్ సెంటర్లను, పాలిసెట్ కౌన్సెలింగ్ ఇన్‌చార్జ్ మహేంద్రను 94925 26080 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

పీడబ్ల్యూడీ, క్యాప్, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అండ్ గేమ్స్, స్కాట్స్ అండ్ గైడ్స్, వంటి స్పెషల్ కేటగిరి అభ్యర్థులు విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ హాజరవ్వాలని పేర్కొన్నారు.

ర్యాంకుల వారీగా కౌన్సెలింగ్ తేదీలు

తేదీ	ర్యాంకు నుంచి	ర్యాంకు వరకు
21-06-2025	1	15,000
22-06-2025	15,001	32,000
23-06-2025	32,001	50,000
24-06-2025	50,001	68,000
25-06-2025	68,001	86,000
26-06-2025	86,001	1,04,000
27-06-2025	1,04,001	1,20,000
28-06-2025	1,20,001	చివరి ర్యాంకు

తీసుకురావాల్సిన సర్టిఫికెట్లు ఇవే

కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ప్రింట్ అవుట్ తీసుకున్న ప్రాసెసింగ్ ఫీజు రసీదు, పాలిసెట్ హాల్ టికెట్, ర్యాంకు కార్డు, పది, తత్సమాన విద్యార్హత మార్క్స్ మెమో, 4నుంచి పదో తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్స్, ఈడబ్ల్యూఎస్, ఇన్‌కమ్ సర్టిఫికెట్లు, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు కుల ధ్రువీకరణ పత్రం, టీసీ ఒరిజనల్స్, రెండు సెట్ల జిరాక్స్ కాపీలను వెంట తీసుకురావాలి.

వేరుశనగపై వెనుకడుగు





రైతులకు పంపిణీ చేసేందుకు వచ్చిన వేరుశనగ విత్తనాలు, సబ్సిడీ విత్తనాలను సాగు చేయాలని రైతులకు సూచిస్తున్న అధికారులు

- సాగుపై అన్నదాతల సంకటం
- తగ్గనున్న వేరుశనగ సాగు విస్తీర్ణం
- విత్తనాలు తీసుకున్నా సాగుకు కదలని రైతన్న
- కచ్చితంగా సాగు చేయాలని చెబుతున్న అధికారులు

పలమనేరు : ఖరీఫ్ సీజన్‌లో వర్షాధారంగా జిల్లాలో వేరుశనగ ఎక్కువ మంది సాగు చేస్తారు. కానీ ఏటా వేరుశనగ సాగుపై జిల్లాలోని రైతులు ఆసక్తి చూపడంలేదు. ఇందుకు ప్రధాన కారణం పంటకు పెట్టిన పెట్టుబడులు దక్కడం లేదు. అతివృష్టి, అనావృష్టితో పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. పంట దిగుబడులు ఎకరానికి నాలుగైదు బస్తాలు కావడం లేదు.

ఎకరా పొలంలో పంట సాగుకు రూ.15 వేల దాకా పెట్టుబడి అయితే దిగుబడి రూ.5 వేలు కూడా దక్కడం లేదు. దీంతో రైతులు వేరుశనగ పంటపై ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది.

- అధికారులేమో విత్తనాలిచ్చేటప్పుడు తప్పకుండా సాగుచేస్తామని ధ్రువీకరణ తీసుకొని రైతులకు పంపిణీ చేస్తున్నారు. కానీ సగం మంది రైతులు విత్తనాలను సాగు చేయకుండా ఇంటి అవసరాలకు వాడుకోవడం జరుగుతోంది. దీంతో జిల్లాలో ఏటా వేరుశనగ సాగు విస్తీర్ణం తగ్గుముఖం పడుతోంది.

తగ్గుముఖం పట్టిన సాగు

పదేళ్ల కిందట ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1.20 లక్షల హెక్టార్లలో వేరుశనగ సాధారణ సాగుగా ఉండేది. ఏటా పంటల సాగు తగ్గుతూ వస్తోంది. జిల్లా విభజన జరిగాక పంట సాధారణ సాగు 55 వేల హెక్టార్లకుగా ఉండేది. ప్రస్తుతం సాధారణ సాగు 35 వేల హెక్టార్లకు పడిపోయింది. దీంతో ఈ విడత పంటల సాగు 20 వేల హెక్టార్లు కూడా అనుమానంగానే మారింది.

వేరుశనగ విత్తనకాయలకు సంబంధించిన వివరాలు

జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం :	35,228 హెక్టార్లు
ఖరీఫ్‌లో పంటను సాగు చేసే రైతులు :	90 వేల మంది
అవసరమైన విత్తనకాయలు :	40 వేల క్వింటాళ్లు
కూటమి ప్రభుత్వంలో అందినవి :	26,349 క్వింటాళ్లు
త్వరలో జిల్లాకు రానున్న విత్తనాలు :	13 వేల క్వింటాళ్లు

విత్తనకాయలు తీసుకుంటున్నారు..

బహిరంగ మార్కెట్‌లో వేరుశనగ కిలో ధర రూ.93 దాకా ఉంది. ప్రభుత్వం 40శాతం సబ్సిడీతో (రాయితీ రూ.37.20 పైసలు)పోనూ రైతు వాటాగా రూ. 55.80 చెల్లించాలి. దీంతో కేజీకి రైతుకు రూ.37 మిగులుతుంది. బస్తా(30 కేజీలకు) రూ. 1116 దక్కినట్టే. ఇలా వచ్చే డబ్బును ఎందుకు వదులుకోవాలని రైతులు ఎగబడి విత్తనాలను కొంటున్నారు.

విత్తనాలు తీసుకున్న వారు సాగు చేయాలి



పట్టాపాసు పుస్తకం ఉండి ఆధార్ లింకైన రైతులు మొబైల్ నంబరు ఓటీపీ ఆధారంగా విత్తన కాయలను పంపిణీ చేశాం. పొందిన విత్తనాలకు తప్పకుండా సాగు చేయాలని రైతుల నుంచి ధ్రువీకరణ పత్రాలను తీసుకున్నాం. ఇప్పటి దాకా పంపిణీ చేసిన విత్తనాల మేరకు ఎంత మేర పంట సాగు కావాలో లెక్కలు కట్టి క్షేత్ర స్థాయిలో రైతులు పంటను సాగు చేసేలా చర్యలు తీసుకుంటాం.

– మురళీ కృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి

పంట పెట్టుబడి దక్కితే కదా..



ఇంతకు ముందు వేరుశనగ సాగు చేసినోళ్లమే. రాను రాను పంటకు పెట్టిన పెట్టుబడి కూడా దక్కక నష్టాలు చవిచూశాం. అందుకే వేరుశనగకు బదులు చిరు ధాన్యాలు, అక్టోబరులో ఉలవ సాగు చేస్తున్నాం. ప్రభుత్వం వేరుశనగకు కనీస మద్దతు ధర పెట్టి రైతులకు నష్టం రాకుండే చూస్తే సాగు పెరుగుతుంది. నష్టాలు ఎందుకని రైతులు విత్తనాలు తీసుకొని ఇంట్లో అవసరాలకు వాడుకోవాల్సి వస్తోంది.

– సుబ్బన్న, రైతు, కల్లాడు

తహసీల్దార్ల బదిలీల్లో వివక్ష తగదు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఇటీవల నిర్వహించిన తహసీల్దార్ల బదిలీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలపై వివక్ష చూపడం సరికాదని వైఎస్సార్‌సీపీ ఉద్యోగులు, పెన్షనర్స్ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయసింహారెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు చెందిన రెగ్యులర్, సీనియర్ తహసీల్దార్లకు పోస్టింగ్స్ ఇవ్వకపోవడం వివక్ష చూపినట్టేనన్నారు. ఎన్నో సంవత్సరాలుగా తహసీల్దార్లు అయిన సీనియర్లకు లూప్ లైన్‌లో పెట్టడం అవమానించినట్లేనని ఆరోపించారు. అర్హత లేని , క్రమశిక్షణ కేసులు పెండింగ్‌లో ఉన్న డిప్యూటీ తహసీల్దార్లను ఇంచార్జిగా కొనసాగించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పోస్టింగ్స్ పొందిన డిప్యూటీ తహసీల్దార్లకు పూర్వపు కలెక్టర్లు, ప్రస్తుత కూటమి నాయకుల అండదండలు ఉన్నాయన్నారు. దాదాపు 7 మంది ఎస్సీ, ఎస్టీ , బీసీ కులాల తహసీల్దార్లు అధికార పార్టీ నాయకుల అండదండలు, పలుకుబడి లేక కలెక్టర్ కార్యాలయంలో ఖాళీ కుర్చీలకు పరిమితమయ్యారన్నారు. ఈ సమస్యను కలెక్టర్ పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా పోస్టింగ్స్ ఇవ్వాలని ఆయన కోరారు.

వ్యక్తి ఆత్మహత్య

చౌడేపల్లె : కుటుంబ కలహాల కారణంగా మనస్తాపం చెంది పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ నాగేశ్వర రావు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలు. మండలంలోని గడ్డంవారిపల్లె మార్గంలో గల దొడ్డిగాని దేవలం వద్ద పండ్లు, కూరగాయల తోటకు కాపలా ఉన్న రవి(30) రెండు రోజుల కిందట కుటుంబ కలహాలతో పురుగు మందుతాగాడు. గమనించిన కుటుంబీకులు పుంగనూరుకు తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయాకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి అన్న దొరస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.